

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం పలుకుతున్న మహిళలు



# కనిపించేదంతా కేసీఆర్ అభివృద్ధే

## రేవంత్ సర్కార్ తట్టా మట్టి తీయలే..

- బీఆర్ఎస్ ప్రభుత్వంలో 4.50 లక్షల ఎకరాల్లో 2.50 లక్షల మందికి పట్టాలిచ్చాం.. ● రైతు భరోసా రూ.15 వేలు ఇవ్వాల్సిందే.. రూ.12 వేలు ఇస్తామంటే ఊరుకోం..
- బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులెన్నీ పెట్టినా.. ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటాం.. ● జైనూర్ ఘటనలో నష్టపోయిన వారికి న్యాయం చేయాలి
- శైలజ కుటుంబానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలి ● బాధితులకు న్యాయం జరిగే దాకా బీఆర్ఎస్ వారి వెంటే ఉంటది..
- సింగరేణిలో టీబీజీకేఎస్‌కు పూర్వవైభవం తీసుకొచ్చాం.. ● ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల పర్యటనల్లో ఎమ్మెల్సీ కవిత

వాంకిడి మండలంలోని దాబా గ్రామంలో శైలజ తల్లి మీరాబాయిని ఓదారుస్తున్న ఎమ్మెల్సీ కవిత




మంచిర్యాల, జనవరి 6(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కనిపించేదంతా కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి తప్పితే.. రేవంత్‌రెడ్డి సర్కారు ఇప్పటివరకు తట్ట మట్టి తీసింది లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ధ్వజమెత్తారు. తన పర్యటన సందర్భంగా అనేక గ్రామాల్లో వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలన్నీ ఎండిపోయి కనిపించాయన్నారు. ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో సోమవారం పర్యటించిన కవిత ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి నివాసంలో సాయంత్రం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపుతో ఏర్పాటు చేసిన గురుకులాల్లో చదువుకున్న పిల్లలు ఐఐటీల్లో ర్యాంకులు సాధించారని, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, గ్రూప్స్ సాధించారన్నారు. కానీ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ రోజు గురుకులాల్లో ఆ పరిస్థితి లేదన్నారు. పిల్లలకు పాములు, తేల్లు కుట్టడం, విషాహారంతో ప్రాణాలు పోగొట్టుకునే దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. తెలంగాణలో ఆడబిడ్డలకు కేసీఆర్ సర్కారు కల్పించిన భద్రతను కాంగ్రెస్ సర్కారు కల్పించడంలో విఫలమైందన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు రైతు భరోసా ఎకరానికి రూ.15 వేలు ఇవ్వాల్సిందేనని, రూ.12 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటామంటే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక ప్రతిపక్ష పార్టీ నాయకులపై కక్ష తీసుకునే ధోరణిలో అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. ఎన్ని కేసులు పెట్టినా మొక్కవోని ధైర్యంతో ఈ ప్రభుత్వాన్ని ఎదుర్కొంటామని, ప్రజలకు రావాల్సిన హక్కులపై వారిని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, చిత్రంలో ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి



వాంకిడి మండలంలోని దాబా గ్రామంలో శైలజ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న కవిత

### 4.50 లక్షల ఎకరాలకు పట్టాలిచ్చాం..

భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాటం చేసిన ఆదివాసీ యోధులను స్మరించుకుంటూ ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తే నరనరాల్లో ఉత్తేజం నిండిపోయిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. అమరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుంటూ వచ్చామన్నారు. భూమి కోసం పోరాటం చేసిన గిరిజన, ఆదివాసులకు భూములపై హక్కులు ఉండాలనే ఉద్దేశంతో గత ముఖ్యమంత్రి కేసీఆర్ 4.50 లక్షల ఎకరాల పైచిలుకు భూములను 2.50 లక్షల మందికి పట్టాలిచ్చారన్నారు. బీఆర్ఎస్, కేసీఆర్ పదేళ్ల పాలనలో భూమి కోసం, భుక్తి కోసం పోరాటం చేసిన వీరులందరినీ స్మరించుకున్నారు. కానీ.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆదివాసులపై శీతకన్ను వేస్తున్నదన్నారు. ఆనాడు మా హయాంలో అటవీ భూములపై హక్కులు ఇచ్చామని, ఆ వెంటనే రైతుబంధు వేశామన్నారు. ఇప్పుడున్న రేవంత్‌రెడ్డి సర్కారు కూడా ఆదివాసీ, గిరిజనులకు ఆదుకోవడానికి అదే స్థాయిలో ముందుకు రావాలన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ అనేక సార్లు రాష్ట్రం ఏర్పడ్డాక చిన్న జిల్లాలు చేసుకుంటామని చెప్పారన్నారు. చెప్పినట్లుగానే తెలంగాణ ఏర్పడ్డాక ఆసిఫాబాద్ జిల్లా కేంద్రమైందని, అన్ని రకాల అభివృద్ధి పనులు కలెక్టరేట్, ఎస్పీ ఆఫీస్, మెడికల్ కాలేజీలతో ప్రజలకు పరిపాలన, ప్రభుత్వ సేవలు చేరువలోకి వచ్చాయన్నారు. అంతకు ముందు బెజ్జూర్, కౌటాల, జైనూర్, కెరిమెరి వంటి మండలాల నుంచి ఆదిలాబాద్‌కు పోయిరావాలంటే మూడు రోజుల సమయం పడుతుండేదన్నారు. కలెక్టర్‌తోని పని చేసుకోవాలంటే అనేక వ్యయప్రయాసలు పడాల్సి వచ్చేదన్నారు. కేసీఆర్ వచ్చాక ఆ దుస్థితిపోయి ప్రజలకు అందుబాటులోకి పాలన తీసుకొచ్చారన్నారు. దూరదృష్టితో గిరిజన, ఆదివాసులు బాగుండాలనే ఉద్దేశంతో ఆసిఫాబాద్ జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. వెనుకబడిన జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఎస్సీ, ఎస్టీ గురుకులాలు, ఏకలవ్య స్కూల్స్, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేశారన్నారు. ఎస్టీ గురుకులాల్లో ఆడపిల్లల కోసం డిగ్రీ కాలేజీలను పెట్టిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. అడవి బిడ్డల కోసం ప్రేమతో పని చేశారన్నది జిల్లా ప్రజలందరి దృష్టిలో ఉందన్నారు.

### టీబీజీకేఎస్‌కు పూర్వ వైభవం

సింగరేణిలో టీబీజీకేఎస్‌కు పూర్వవైభవం వస్తుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఆసిఫాబాద్ పర్యటనలో భాగంగా సోమవారం రాత్రి గోలేటిలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో కవిత మాట్లాడారు. తెలంగాణ అంటేనే సింగరేణి అన్నారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ కారుణ్య నియామకాలను పునరుద్ధరించారన్నారు. ప్రైవేటీకరణ కోసం కేంద్ర ఎంత ఒత్తిడి చేసినా మనం చేయలేదన్నారు. సింగరేణి కార్మికుల కోసం అనేక కార్యక్రమాలు తీసుకొచ్చారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ జనాలను ఎలా మోసం చేసిందో సింగరేణి కార్మికులను అధికార పార్టీ కార్మిక సంఘాలు అంతకంటే అద్భుతంగా మోసం చేశాయన్నారు. లాభాల్లో వాటా ప్రకటించి కేసీఆర్ కంటే ఒక శాతం ఎక్కువ ఇచ్చామని ఊదరగొట్టారన్నారు. వాస్తవానికి 50 శాతం కోత పెట్టి కార్మికుల పొట్ట కొట్టారన్నారు. గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ ఏం మాట్లాడకుండా వాళ్లు బిచ్చం వేస్తే మనం తీసుకుందాం అన్నట్లుగా ఉన్నారు తప్పితే ఏం చేయలేదన్నారు. లాభాలు రూ.4,500 కోట్లు వచ్చినయంటే అందులో మీ అందరి చమట చుక్కలు ఉన్నాయన్నారు. మీ కష్టంతో వచ్చిన లాభాలను మీకు పంచడానికి వీళ్లకు ఏం నొప్పో నాకు అర్థం కాలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో 38 శాతం ఇచ్చామన్నారు. కార్మికుల పక్షాన గట్టిగా మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. మన టీబీజీకేఎస్ ఒక అడుగు వెనక్కి వేసినట్లు కనిపిస్తున్నా.. పులి ఒక అడుగు వెనక్కి వేస్తే దాని పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఒక అడుగు వెనక్కి వేసింది ఆలోచన కోసమేనని, టీబీజీకేఎస్‌కు తప్పకుండా పూర్వవైభవం వస్తుందన్నారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసుకుంటామన్నారు. కార్మికుల పక్షాన నిరంతరాయంగా, అలుపులేకుండా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.


గోలేటిలో నిర్వహించిన సింగరేణి కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, టీబీజీకేఎస్ నాయకుడు మిర్యాల రాజిరెడ్డి

### బాధితులకు భరోసా..

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు, మహిళలు, బహుజనులు, దళితులు, గిరిజనులు, ఆదివాసీ వర్గాలన్నింటికీ అన్యాయం జరుగుతుందన్నారు. జైనూర్ ఘటనలో బాధితురాలైన ఆదివాసీ మహిళ మెస్రం నీలాబాయి, ఆశ్రమ పాఠశాలలో విషాహారం తిని మృతి చెందిన శైలజ ఘటనల్లో రేవంత్ సర్కారు మొద్దునిద్ర పోయిందన్నారు. సున్నితమైన విషయాల్లో స్పందించడం, బాధితులకు భరోసా కల్పించడంలో విఫలమైందన్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా జైనూర్ ఘటనలో బాధితురాలైన నీలాబాయి కుటుంబాన్ని పరామర్శించారు. వైద్యం అందుతున్న తీరు, ప్రభుత్వ సహాయ సహకారాలపై ఆరా తీశారు. నీలాబాయి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.2 లక్షల చెక్కును అందజేశారు. జైనూర్ ఘటనలో దుకాణాలు కాలిపోయి నష్టపోయిన వివిధ వర్గాల ప్రజలందరికీ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అక్కడి నుంచి ప్రమాదంలో గాయపడి నాలుగేళ్లుగా ఇబ్బందులు పడుతున్న మాజీ ఎంపీటీసీ జామ్ని, తెలంగాణ ఉద్యమకారుడు లట్‌పటే మాధవ్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. అనంతరం కెరిమెరి మీదుగా వాంకిడి మండలంలోని దాబా గ్రామానికి బయల్దేరారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో విషాహారం తిని మృతి చెందిన శైలజ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న క్రమంలో వాంకిడి సమీపంలో కవిత కాన్వాయ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకుల మధ్య స్వల్ప వాగ్వాదం, తోపులాట చోటు చేసుకున్నది. శైలజ చదువుకున్న ఆశ్రమ పాఠశాల ముందు నుంచి కాన్వాయ్ వెళ్లడానికి అనుమతి నిరాకరించిన పోలీసులు, వేరే మార్గంలో దాబా గ్రామానికి తీసుకెళ్లారు. అక్కడ శైలజ కుటుంబ సభ్యులను పరామర్శించిన కవిత రూ.2 లక్షల చెక్కును అందజేశారు. గతంలో నిమ్స్ ఆసుపత్రిలో శైలజ చికిత్స పొందుతున్న సమయంలోనూ ఎమ్మెల్సీ కవిత వెళ్లి విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. శైలజ మృతి వార్తతో చలించిపోయిన ఆమె రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఈ మేరకు ఆ చెక్కును సోమవారం స్వయంగా బాధితురాలి ఇంటికి వెళ్లి అందజేశారు. శైలజ కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలన్నారు. రోజంతా ఆదివాసులతో మమేకమై ఆడిపాడడం, వారి కష్టాలు పంచుకోవడం, వారితో గడపడం సంతోషంగా ఉందన్నారు. ఆదివాసుల సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపైన ఉందన్నారు. దండారీ సమయంలో కేసీఆర్ ఆదివాసీ గూడేలకు రూ.10వేలు ఇచ్చిన విషయాన్ని ఇంకా గుర్తు చేసుకుంటున్నారన్నారు. గిరిజన, ఆదివాసులపై ప్రేమతో సంస్కృతిని కాపాడుకున్నామని, ప్రేమతో మతపరమైన గొడవలు కాకుండా చూసుకున్నామన్నారు. కానీ.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక అనేక ఘటనలు జరుగుతున్నాయి. తెలంగాణలో ప్రశాంతమైన అందరు కలిసిమెలిసి బతికే వాతావరణం కల్పించాలని కోరుతున్నామన్నారు.

### బైక్ ర్యాలీలు.. ఘన స్వాగతాలు..



కుమ్రం భీం విగ్రహానికి బొట్టు పెడుతూ..

ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఎమ్మెల్సీ కవిత పర్యటన సందర్భంగా అడుగడునా బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. సోమవారం ఉదయం ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపానికి నివాళులర్పించిన అనంతరం నస్పూర్ క్రాస్ రోడ్డు దగ్గరకు చేరుకున్న కవితకు కార్యకర్తలు బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. జైనూర్, కెరిమెరి, ఆసిఫాబాద్‌లోనూ స్వాగతం పలికారు. అనుమతులు ఉన్న మేరకు బైక్ ర్యాలీలు తీశారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకోగానే పూలవర్షం కురిపించి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఆదిలాబాద్ మాజీ జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, కరీంనగర్ మాజీ మేయర్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్, టీబీజీకేఎస్ నాయకులు రాజిరెడ్డి పాల్గొన్నారు.



కవితకు స్వాగతం పలుకుతున్న దేవుగూడ గ్రామస్తులు



దేవుగూడలో ఆదివాసీ మహిళలతో నృత్యం చేస్తూ..


నేరడిగొండలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, రైతులు


పెంబి : హామీ పత్రాలను తగలబెడుతూ..


ఖానాపూర్ : తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద నిరసన తెలుపుతూ..


ఇంద్రవెల్లి : కాంగ్రెస్ వరంగల్ డిక్లరేషన్ ప్రతిని దహనం చేస్తూ..

## కాంగ్రెస్ మోసంపై ఆగ్రహజ్వాల

- ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆందోళనలు
- కాంగ్రెస్ వరంగల్ డిక్లరేషన్ ప్రతులను దహనం చేసి నిరసన
- ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్

ఆదిలాబాద్, జనవరి 6(నమస్తే తెలంగాణ) : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చకుండా మోసం చేసినందుకు ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల వ్యాప్తంగా సోమవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. పలు మండల కేంద్రాల్లో రోడ్లపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వరంగల్‌లో సభ నిర్వహించి రైతుల కోసం వరంగల్ డిక్లరేషన్‌ను ప్రకటించిందని, దీనిని అమలు చేయడంలో విఫలమైందంటూ ఇంద్రవెల్లిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు డిక్లరేషన్ ప్రతిని దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా మోసం చేస్తుందన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ విషయంలో ముఖ్యమంత్రితోపాటు మంత్రులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అర్హులుగా ఉన్న చాలా మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదన్నారు. పంటల కొనుగోళ్లలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సోయాబిన్‌ను కొనుగోలు చేయకపోవడంతో రైతులు దళారులకు విక్రయించి నష్టపోతున్నారని మండిపడ్డారు. రైతుభరోసా పథకంలో భాగంగా ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే రెండు పంటలకు సంబంధించిన పైసలు ఎగ్గొట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు రూ.15 వేలు కాకుండా రూ.12 వేలు ఇస్తామని ప్రకటించడం రైతులను మోసం చేయడమే అని ఆగ్రహం వ్యకం చేశారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు.

## బీఆర్ఎస్ హయాంలోనే ఆదివాసుల అభ్యున్నతి

- అమరవీరుల ఆశయాలను నెరవేర్చిన కేసీఆర్ సర్కారు
- అమరవీరులకు నివాళులర్పించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

ఇంద్రవెల్లి, జనవరి 6 : తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఆదివాసుల అభ్యున్నతి జరిగిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సోమవారం ఇంద్రవెల్లి మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తోపాటు మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులతో కలిసి అమరవీరుల స్తూపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. టెంకాయ కొట్టి అమరవీరులకు పుష్పాలతో నివాళులర్పించారు. ముందుగా నాయకులతోపాటు ఆదివాసీ గిరిజన నాయకులు, మహిళా నాయకులు కవితకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్‌కు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ మారుతి పటేల్ డోంగ్రే, బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఆదివాసీ గిరిజన నాయకులు పుర్కా బాపురావ్, ఆదివాసీ సంఘాల నాయకులు తోడసం నాగోరావ్, పుర్కా చిత్రు, సోయం రాందాస్, గేడం భరత్, కాత్లే పృథ్వీరాజ్, బీఆర్ఎస్ పార్టీ మండల కో-ఆర్డినేటర్ షేక్ సుఫియాన్, జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ అబ్దుల్ అమ్జద్, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మిర్జా జిలానీబేగ్, మాజీ ఎంపీటీసీ మడావి భీంరావ్, నాయకులు శ్రీనివాస్, రాంనివాస్, వసంత్‌రావ్, ప్రకాశ్, ధరిని ధన్‌రాజ్, మురాహరి, సతీశ్, రాజేశ్ పాల్గొన్నారు.


ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత


స్తూపం వద్ద ఎమ్మెల్సీ కవిత, బీఆర్ఎస్, ఆదివాసీ నాయకులు


స్తూపానికి బొట్టు పెడుతూ..